

# ఎడ్జ్‌బాస్టన్.. కోహ్లీని వెనక్కి నెట్టేస్తారా? 39 ఏళ్ల బౌలింగ్ రికార్డు బ్రేక్ అవుతుందా?

ఇంగ్లాండ్ - టీమ్‌ఇండియా జట్ల మధ్య రెండో టెస్టుకు వేదిక బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానం. ఇప్పటి వరకు టీమ్‌ఇండియా ఇక్కడ ఒక్క టెస్టులోనూ గెలవలేదు. అసలే తొలి టెస్టు ఓటమితో ఇబ్బంది పడుతోన్న భారత్‌కు పెద్ద సవాల్ తప్పదు. ఇలాంటి కఠినమైన పిచ్‌పైనా సెంచరీలు చేసిన భారత బ్యాటర్లూ ఉన్నారు. వారిలో ఇద్దరు రిటైర్‌మెంట్ కాగా.. మరో ఇద్దరు ప్రస్తుత జట్టులో సభ్యులుగా ఉన్నారు. అలాగే ఇక్కడ అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా దాదాపు 30 ఏళ్ల నుంచి ఒకరి పేరే కొనసాగుతుండటం గమనార్హం. మరి ఆ ఆటగాళ్లు ఎవరు..? ఆ రికార్డులు ఏంటో తెలుసుకుందాం..

విరాట్ టాప్ స్కోరర్..

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా టెస్టు చరిత్రలో 86 సెంచరీలు నమోదు కాగా.. భారత్ నుంచి నలుగురు మాత్రమే ఉన్నారు. ఇంగ్లాండ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా ఈ జాబితాలో ఉన్నారు. సచిన్ (1996లో 122 పరుగులు), విరాట్ కోహ్లీ (2018లో 149 పరుగులు), రిషభ్ పంత్ (2022లో 146 పరుగులు), రవీంద్ర జడేజా (2022లో 104 పరుగులు) శతకాలు చేశారు. అన్ని మ్యాచుల్లోనూ భారత్ ఓడిపోయింది. కోహ్లీ రికార్డును అధిగమించాలంటే గత టెస్టులో సెంచరీలు చేసిన బ్యాటర్లకు ఛాన్స్ ఉంది.

ఇప్పటికీ చేతన్ శర్మ పేరిటే..

ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ఇంగ్లాండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్. ఈ మాజీ పేసర్ 14 మ్యాచుల్లో 52 వికెట్లు తీశాడు. ఇక భారత్ తరఫున ఎవరో తెలిస్తే ఇప్పటికీ ఆశ్చర్యం కలగకమానదు. చేతన్ శర్మ అనే మాజీ బౌలర్ 10 వికెట్లతో టాపర్‌గా కొనసాగుతున్నాడు. ఇవన్నీ ఒకే మ్యాచ్‌లో తీయడం ఇప్పటికీ భారత్ తరఫున ఘనతే. దాదాపు 39 ఏళ్ల కిందట.. 1986లో.. ఈ మ్యాచ్‌లో ఆ రికార్డును చెరిపేయడం చాలా కష్టమే. బుమ్రా తుది జట్టులో ఉంటే ఏమైనా సాధ్యపడేదేమో కానీ.. అతడు ఆడటంపై అనుమానాల నేపథ్యంలో ఇతర బౌలర్లపై ఆశలు తక్కువే.

మరికొన్ని విశేషాలు..

ఎడ్జ్‌బాస్టన్‌లో 56 టెస్టులు జరిగాయి. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు 29 మ్యాచుల్లో గెలిచింది. మరో 12 సార్లు మొదట బౌలింగ్ తీసుకున్న టీమ్ విజయం సాధించింది. 15 మ్యాచులు డ్రాగా ముగిశాయి.

ఇక్కడ అత్యధిక స్కోరు ఇంగ్లాండ్‌దే. భారత్‌పై 2011లో 710/7 స్కోరు చేసింది. ఇక పాకిస్థాన్ అత్యల్ప స్కోరు చేసిన టీమ్‌గా నిలిచింది. 2010లో ఇంగ్లాండ్‌పై 72 పరుగులకే పరిమితమైంది.

ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధికంగా భారత్ 416 పరుగులు చేసింది. అదీనూ 1989లో కావడం గమనార్హం. ఇటీవల అంటే 2018లో 274 పరుగులు చేసింది. రెండు మ్యాచుల్లోనూ టీమ్‌ఇండియా ఓడింది.

ఈ మైదానంలో భారత్‌పై ఇంగ్లాండ్ 2022లో 378 పరుగులను ఛేదించి విజయం సాధించింది. జానీ బెయిర్ స్టో సెంచరీతో తన జట్టును గెలిపించాడు. ఇప్పటి వరకు ఇదే అత్యధిక లక్ష్య ఛేదన.

# భారత్‌దే 'ఎడ్జ్' అవ్వాలంటే.. 'పట్టు' పట్టాల్సిందే



: ఇప్పుడున్న పరిస్థితుల్లో ఐదు రోజుల ఆటలో.. ప్రతి సెషనూ అత్యంత కీలకం. నాలుగు రోజులపాటు మాదే ఆధిపత్యమని భావించిన జట్టుకూ భంగపాటు ఎదురవడం ఇప్పటికే చూశాం. అందుకు ఇంగ్లాండ్ - భారత జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు ఫలితమే ప్రత్యక్ష సాక్ష్యం. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో 'ఎడ్జ్‌బాస్టన్' వేదికగా రెండో టెస్టుకు సిద్ధమైన వేళ.. టీమ్‌ఇండియా గత పొరపాట్లను పునరావృతం చేయకూడదు.

బజ్‌బాల్‌కు సమాధానం ఇవ్వాలంటే..

ఇంగ్లాండ్ ఆడే తీరును బజ్‌బాల్ క్రికెట్‌గా పిలుస్తుంటారు. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ వారు అదే ఆటతీరు ప్రదర్శించారు. ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకొచ్చి మ్యాచ్‌ను లాగేసుకోవడమే వారి ప్రణాళిక. జస్‌ప్రీత్ బుమ్రాను రెండో ఇన్నింగ్స్‌లో సమర్థంగా ఎదుర్కొని పరుగులు రాబట్టడంలో ఇంగ్లాండ్ సక్సెస్ అయింది. ఇప్పుడు బుమ్రా గైర్హాజరీలో భారత బౌలింగ్ కాస్త బలహీనమనే చెప్పొచ్చు. ఇలాంటప్పుడు బజ్‌బాల్ క్రికెట్‌కు సరైన సమాధానం ఇవ్వాలంటే.. వారి ముందు గతం కంటే భారీగా పరుగులు ఉంచాలి. అలా జరగాలంటే బ్యాటింగ్‌లో అందివచ్చిన ఛాన్స్‌ను భారత బ్యాటర్లు విడిచిపెట్టకూడదు. రెండో టెస్టు వేదిక ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు మంచి రికార్డేమీ లేదు. టాప్ ఆర్డర్ మరింత బాధ్యతగా ఆడాలని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చెబుతున్న మాటలు.. మిడిల్‌తోపాటు లోయర్ ఆర్డర్‌కూ వర్తిస్తాయి.

ఈ మ్యాచ్ చేజారితే మాత్రం..

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 0-1తో వెనకబడింది. ప్రస్తుతం వర్షం పడితేనే మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశాలు ఉంటాయని అందరికీ తెలిసిందే. ఎందుకంటే ఇంగ్లాండ్ జట్టు గెలుపు కోసం రిస్క్ తీసుకొనేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. వారికి కొన్ని ఓటములు ఎదురైనా సరే ఆ పంథాను మాత్రం మార్చుకోలేదు. ఎడ్జ్‌బాస్టన్‌లోనూ పర్యాటక జట్టుకు ఓటమి ఎదురైతే మాత్రం సిరీస్‌లో పుంజుకోవడం చాలా కష్టమే. అప్పుడు మిగిలిన మూడింట్లో ఒక్కటి ఓడినా సిరీస్ పోయినట్లే. అండర్సన్ - తెందుల్కర్ ట్రోఫీని సొంతం చేసుకోవాలన్నా ఇప్పుడీ విజయం కీలకం.

పంచ సూత్రాలను ఫాలో కావాలి..

టాప్ ఆర్డర్ సెంచరీలు చేసినా.. మిడిలార్డర్ బ్యాటర్లు కనీసం కొన్ని పరుగులైనా చేయాలి. ఇంగ్లాండ్ జట్టుకు టీమ్‌ఇండియాకు ఇదే ప్రధాన వ్యత్యాసం. ఆ జట్టు తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో లోయర్ ఆర్డర్ బ్యాటర్లు క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జేమీ స్మిత్ విలువైన పరుగులు రాబట్టారు.

బౌలింగ్‌లో గత ఆస్ట్రేలియా సిరీస్ నుంచి బుమ్రా పైనే భారత్ ఎక్కువ భారం వడుతోంది. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో టెస్టుల్లోనూ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పెద్దగా ప్రభావం చూపించలేదు. రెండో టెస్టులో బుమ్రా లేకపోతే పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. అర్ష్‌దీప్ అరంగేట్రం చేసినా అతడికి ఈ ఫార్మాట్ కొత్త. సిరాజ్ సీనియర్ హోదాలో ముందుండి నడిపించాల్సి ఉంటుంది.

ఫీల్డింగ్ విషయంలో భారత్ అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు కోల్పోవడంలో బ్యాటింగ్, బౌలింగ్‌లో లోపాలు ఎంత ప్రభావం చూపించాయో.. క్యాచులను జారవిడవడం అంతకంటే ఎక్కువ నష్టం చేసింది. బంతిని నిశితంగా గమనించి అందుకొంటే మ్యాచ్‌ను దాదాపు చేతుల్లోకి తీసుకొన్నట్లే.

కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కిదే అతిపెద్ద పర్యటన. బౌలర్లను, బ్యాటర్లను సద్వినియోగం చేసుకోవడంలో కాస్త తడబాటు కనిపిస్తోందనేది క్రీడా పండితుల మాట. బౌలింగ్‌లో మార్పులు చేయాల్సిన తరుణంలో.. ఒకరి పైనే ఎక్కువగా ఆధారపడ్డాడని తొలి టెస్టు మ్యాచ్‌ను చూస్తే అర్థమైంది. కాస్త రిస్క్ అయినా సరే ప్రత్యర్థిని బట్టి బౌలర్లను బరిలోకి దింపాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో గిల్ ఇంకాస్త పరిణతి సాధించాలి.

తుది జట్టు ఎంపికలో మేనేజ్‌మెంట్ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో ఆల్‌రౌండ్ పాత్రను పోషించడంలో కాస్త సక్సెస్ అయిన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్‌రెడ్డిని స్క్వాడ్‌లో తీసుకున్నప్పటికీ తుది జట్టులో అవకాశం కల్పించాల్సింది. లోయర్ ఆర్డర్‌లో శార్దూల్ కంటే నితీశ్ విలువైన ఇన్నింగ్స్‌లు ఆడగలడని ఇప్పటికే నిరూపితమైంది. రెండో టెస్టులోనైనా ఫైనల్ %శ×%లో నితీశ్‌కు అవకాశం ఇవ్వాలి.



# ఐపీఎల్ స్టార్ ఔట్.. తుది జట్టులోకి మరో ఆల్‌రౌండర్

: సాయి సుదర్శన్ . దేశవాళీలో అదరగొట్టాడు. ఐపీఎల్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. దీంతో అతన్ని ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేయాలని అంతా డిమాండ్ చేశారు. కానీ, తొలి ఇన్నింగ్స్‌లోనే డకౌట్‌తో ఇబ్బందిపడ్డాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో వచ్చిన శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇప్పుడు రెండో టెస్టులో అతడిపై వేటు పడే అవకాశం ఉందనేది క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ కూడా తుది జట్టులోకి మరో ఆల్‌రౌండర్‌ను తీసుకోవాలని భావిస్తోందని కథనాలు వెలువడుతున్నాయి.

సుందర్‌కే ఛాన్స్..

స్పిన్ విభాగాన్ని మరింత కట్టుదిట్టం చేయడంతోపాటు లోయర్ ఆర్డర్‌లో కీలక పరుగులు రాబట్టే వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవాలని మేనేజ్‌మెంట్ చూస్తోందని సమాచారం. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఉన్నా.. లోతైన బ్యాటింగ్ ఆర్డర్ కీలకమనే ఉద్దేశంలో మేనేజ్‌మెంట్ ఉంది. అందుకే కుల్‌దీప్‌ను కాదని సుందర్‌ను తీసుకుంటే కింది వరుసలోనూ పరుగులు చేయగలడు. సాయిసుదర్శన్ తొలి టెస్టులో వన్‌డౌన్‌లో వచ్చాడు. సాధారణంగా ఆ ప్లేస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రావాలి. సాయి కోసం గిల్ సెకండ్ డౌన్‌కు మారాడు. ఇప్పుడు సుదర్శన్ తుది జట్టులో లేకపోతే గిల్ వన్‌డౌన్‌లో ఆడతాడు. అలాగే కరుణ్‌నాయర్ లేదా రిషభ్ పంత్ సెకండ్‌డౌన్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. తొలి టెస్టులో పంత్ ఆ స్థానంలో ఆడాడు. రెండు సెంచరీలు బాదాడు. కానీ, కరుణ్ నాయర్ మాత్రం పెద్దగా ఆకట్టుకోలేదు. స్థానం మారిస్తే ఏమైనా బ్యాటింగ్‌లో మెరుగవుతాడేమో చూడాలి. పేస్ ఆల్‌రౌండర్‌గా శార్దూల్ ఠాకూర్ స్థానంలో నితీశ్‌కు ఛాన్స్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తొలి టెస్టులో కేవలం 4 పరుగులు చేసి.. 2 వికెట్లు మాత్రమే శార్దూల్ తీశాడు.

వాతావరణం ఎలా ఉండనుందంటే?

బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న రెండో టెస్టు మ్యాచ్ తొలి రోజు వరుణుడు కాసేపు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. అదీనూ టాస్ సమయంలో కొద్దిపాటి వర్షం పడుతుందని వెదర్ రిపోర్ట్ చెబుతోంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) మ్యాచ్ మొదలవుతుంది. అర్ధగంట ముందుగా అంటే 3 గంటలకు టాస్ వేయాలి. అప్పుడే వాన పడుతుందని.. టాస్ ఆలస్యమయ్యేందుకు ఛాన్స్ ఉందనేది వెదర్ రిపోర్ట్ చెబుతున్న మాట. ఆ తర్వాత మ్యాచ్ నిర్వహణకు ఎలాంటి ఆటంకం ఉండదని.. వాతావరణం కూడా పొడిగా మారుతుందని సమాచారం.

# ఎప్పుడైతే అతడు 'డబుల్' కొట్టాడో.. నా కెరీర్ ముగిసిందనుకున్నా: ధావన్



భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన ఆత్మకథ 'ది వన్' ప్రకటించాడు. క్యాచ్ పట్టినప్పుడు తనదైన శైలిలో సంబరాలు చేసుకొనే ధావన్‌ను 'గబ్బర్'గా అభిమానులు ముద్దుగా పిలుచుకుంటారు. టీమ్‌ఇండియా తరఫున ఓపెనర్‌గా వచ్చి అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడిన ధావన్ కూడా కెరీర్‌లో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నాడు. తన ఆత్మకథ ప్రకటన సందర్భంగా ఓ ఆంగ్ల ఛానల్‌తో ధావన్ పలు విషయాలను పంచుకున్నాడు. తనను జట్టు నుంచి తొలగించినప్పుడు ఎవరినీ కాంటాక్ట్ చేయలేదని పేర్కొన్నాడు. అలాగే యువ ఆటగాడు ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ చేసినప్పుడు తన కెరీర్ ముగింపు దశకు చేరుకుందని భావించినట్లు వెల్లడించాడు.

"నేను దేశవాళీ క్రికెట్‌ను చాలా చక్కగా వినియోగించుకున్నా. నేను టెస్టు అరంగేట్రం చేయకముందే భారత్ తరఫున అత్యధిక సెంచరీలు చేయాలని కలలు కనేవాడిని. ఆసీస్‌పై మంచి ఆరంభం దక్కింది. నా సహజసిద్ధమైన షాట్లను ఆడటంతోనే ఇది సాధ్యమైంది. ఆ తర్వాత కూడా ఓపెనర్‌గా 40 సగటుతో పరుగులు రాబట్టా. అయితే, ఇంగ్లాండ్ వంటి జట్టుపై నేను సరిగ్గా ఆడలేకపోయా. అక్కడికి రెండుసార్లు వెళ్లినా కాస్త ఇబ్బందిపడ్డా. 2018 ఇంగ్లాండ్ పర్యటనే నాకు చివరిదిగా మారింది. నా కెరీర్‌పై ఇప్పటికీ సంతోషంగానే ఉన్నా" అని ధావన్ తెలిపాడు.

నేనెప్పుడూ కుంగిపోలేదు..

"నా కెరీర్‌లో చాలా హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఎక్కువగా శతకాలు చేయలేకపోయా. కానీ, 70లు అధికంగానే ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ చేశాడు. అప్పుడే నా అంతరాత్మ ఓ విషయం స్పష్టంగా చెప్పేసింది. 'నీ కెరీర్ ముగింపుదశకు చేరుకుంది' నా ఇన్నర్ వాయిస్ వినిపించింది. నా శ్రేయోభిలాషులు, స్నేహితులు మద్దతుగా నిలవడం నాకు ఇప్పటికీ గుర్తుంది. నేను కుంగిపోతానని భావించారు. కానీ, అలాంటిదేమీ జరగలేదు. ఇప్పటికీ దానిని ఆస్వాదిస్తూనే ఉంటా. జట్టులో స్థానం కోల్పోవడమనేది క్రికెటర్ల కెరీర్‌లో సహజంగా జరిగేదే. ఆ సమయంలో నేను రాహుల్ ద్రవిడ్‌తో మాట్లాడా. నాకు అతడు మెసేజ్ చేశాడు. ప్రతిఒక్కరూ తమదైన శైలిలో ముందుకు ప్రయాణించాల్సి ఉంటుంది" అని ధావన్ వెల్లడించాడు. 2022లో ఇషాన్ కిషన్ (210) బంగ్లాదేశ్‌పై కేవలం 126 బంతుల్లోనే డబుల్ సెంచరీ సాధించాడు.

ఇప్పటికీ ధావనే..

తొలి టెస్టులోనే ఆస్ట్రేలియా టాప్ బౌలర్లను ఎదుర్కొని సూపర్ సెంచరీ (187 పరుగులు) చేసిన ధావన్.. కెరీర్‌లో కేవలం 34 టెస్టులు మాత్రమే ఆడటం గమనార్హం. అరంగేట్ర టెస్టులోనే అత్యంత వేగంగా (85 బంతుల్లో) శతకం చేసిన భారత బ్యాటర్‌గా ఇప్పటికీ అతడే కొనసాగుతున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 7 సెంచరీలు, 5 హాఫ్ సెంచరీల సాయంతో 2,315 పరుగులు చేశాడు.

